JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 01-07-2026
Medchal - Malkajgiri । Wednesday 01-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 30
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 30 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com



## ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య

- కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవ
- అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం
- స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము



జయభేరి, విశాఖపట్టణం, జూన్ 30 :

విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది.ఈ వేడుకకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ తరం దేశాన్ని ఎలా వదిలి వెళ్తుందో నిర్ణయించేది విద్య. అందుకే విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే విద్యాసంస్థలు మాత్రమే కావు... అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి, నాయకులను తీర్చిదిద్దుతాయి, తరాల భవిష్యత్తును మార్చేస్తాయి. ఈ రోజు కేవలం ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం మాత్రమే కాదు... ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక. నాణ్యమైన విద్య దేశంలోని ప్రతి మూలకు, సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలనే విశ్వాసానికి ప్రతీకగా నిలిచే వేడుక.

...మిగతాది 2 లో



...మిగతాది 2 లో

# రైతు భరోసా నిధులు విడుదల

"తెలంగాణ రైతాంగానికి పండుగ రోజు. చెప్పిన మాట ప్రకారం ప్రజా ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడుదల చేసింది. హైదరాబాద్ శిల్పకళా వేదికగా జరిగిన రైతు భరోసా సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంప్యూటర్ మీట నొక్కి రైతు భరోసా నిధులను విడుదల చేశారు.

జయభేరి, హైదరాబాద్ :

ప్రజా ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు వచ్చే 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లను విడుదల చేయాలన్న సంకల్పంతో తొలి విడతగా 41.37 లక్షల రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడానికి వీలుగా రూ. 2,482.02 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1600 రైతు వేదికల ద్వారా రైతాంగం ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులను విడుదల చేశారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, పలువురు ప్రజా ప్రతినిధులు, CS సంజయ్ జాజుతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. "రాష్ట్రానికి సంబంధించి గడిచిన 30 నెలలుగా సమాజంలో గౌరవం పెంచుకుంటూ విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించుకుంటూ వెళుతున్నాం" అని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యం మేరకు ఆ రంగానికి చేసిన ఖర్చు గణాంకాలను ముఖ్యమంత్రి రైతులకు వివరించారు. "గడిచిన 30 నెలల కాలంలో వ్యవసాయ రంగానికి రూ. 1.75 లక్షల కోట్లను ఖర్చు చేశాం. వచ్చిన మొదటి ఏడాదిలోగా 25.35 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రూ. 20,677 కోట్ల రుణాలను మాఫీ చేశాం.

హైదరాబాద్ లోని శిల్పకళావేదికలో "రైతు భరోసా సదస్సు"లో పాల్గొన్నాను. వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రైతాంగానికి పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించాను. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో 2,482.02 కోట్లు రూపాయల రైతు భరోసా నిధులను జమచేశాం.
--ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ప్రధాని మోడీ అత్యున్నత సమీక్ష..!

- కేబినెట్ మార్పుల వేళ మంత్రులపై రిపోర్ట్..!




2 లో

జయభేరి, న్యూఢిల్లీ :

ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ ఢిల్లీలో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఆయన ఇవాళ భేటీ అయ్యారు. ఎన్డీయే సర్కార్ రెండేళ్ల పాలన తర్వాత ప్రభుత్వ పనితీరు, మంత్రుల పనితీరుపై ప్రధాని మోడీ వివరాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. సంస్కరణలు, వ్యాపార సౌలభ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలపై ప్రధాని సమీక్షించారు. కేబినెట్ ప్రక్షాళన ప్రచారం వేళ ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధానమంత్రి మోదీ కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. విధాన సంస్కరణలు, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై ఆయన చర్చించారు.

## సీఎం సీటుపై కన్నేసిన త్రిష?

- లారెన్స్ తప్పుకోవడంతో రూట్ క్లియర్!



జయభేరి, చెన్నై :

తమిళనాడు రాజకీయాల్లోకి సినీ ప్రముఖుల ఎంట్రీ, ఉప ఎన్నికల సమీకరణాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ అరంగేట్రం గురించిన ఊహాగానాలకు తెరదించుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో త్వరలో జరగబోయే తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని లారెన్స్ స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ఉన్నప్పటికీ.. అంత హడావుడిగా నిర్ణయాలు తీసుకోలేనని, ప్రస్తుతం తన దృష్టి అంతా సినిమా ప్రాజెక్టులు, సామాజిక సేవా కార్యక్రమాలపైనే ఉందని మీడియాకు వివరించారు. రాఘవ లారెన్స్ ఈ విషయం గురించి సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను కూడా విడుదల చేశారు."నీ కర్తవ్యాన్ని నువ్వు చేయి.. ప్రతిఫలంగా దేనినీ ఆశించకు" అనే భగవద్గీత సూక్తిని ప్రస్తావిస్తూ ఆయన తన సందేశాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయాలపై మాట్లాడుతూ.. తనకు హడావుడిగా ఎమ్మెల్యేనో, మంత్రినో అయిపోవాలనే ఆరాటం లేదన్నారు. రాజకీయాలు అనేవి కూరగాయల మార్కెట్ లాంటివి కావని, మనం వెళ్లే చోట మనకు సరైన గౌరవం, గుర్తింపు ఉండాలని పేర్కొన్నారు. గతంలో ప్రజలు, అభిమానులు కోరుకుంటేనే తాను రాజకీయ ప్రయాణాన్ని

...మిగతాది 2 లో

# తెలంగాణ కేబినెట్ సమావేశం



జయభేరి, హైదరాబాద్ :

జూలై 2 గురువారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం 6వ అంతస్తులో ఈ భేటీ జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ భేటీ నేపథ్యంలో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు అజెండా రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేశాయి. ఈ సమావేశానికి సంబంధించిన అజెండా అంశాలను సర్క్యులేషన్ ద్వారా ఆమోదించి వాటిని తెలుగు అనువాదంతో సహా సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు నివేదికలను జూలై 1 న మధ్యాహ్నం 1:00 గంటలకల్లా ఖచ్చితంగా పంపాలని సీఎస్ ఆదేశించారు. ఒకవేళ ఎలాంటి అజెండా అంశాలు లేకపోయినా నిల్ రిపోర్టును పంపాలని స్పష్టం చేశారు. కేబినెట్ సమావేశం ముగిసే వరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిలు, ప్రధాన కార్యదర్శులు ఖచ్చితంగా తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక ప్రస్తుత రాజకీయ, పరిపాలనా పరమైన అంశాలు, అలగే పలు కీలక బిల్లులు, ప్రజా సంక్షేమ పథకాలపై ఈ భేటీలో చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సచివాలయ వర్గాలు తెలిపాయి.

## వ్యవసాయ సంక్షోభం తప్పదా..

2 లో



## హైదరాబాద్ను గ్లోబల్ ఏరోస్పేస్ & డిఫెన్స్ క్యాపిటల్గా తీర్చిదిద్దుతాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ HICU లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్ 2026 అంతర్జాతీయ ఏరోస్పేస్&డిఫెన్స్ బిజినెస్ కన్వెన్సను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఏరోస్పేస్ పి.ఏ ప్రవీణ్, రీజనల్ ప్రోక్యూర్ మెంట్ హెడ్ ఆండ్రీస్ స్పీహ్వాబ్, జాతీయ భద్రతా సలహామండలి సభ్యులు జీ. సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమ దృష్టి ఇప్పుడు హైదరాబాద్పై వుందని అన్నారు. హైదరాబాద్ను గ్లోబల్ ఏరోస్పేస్ & డిఫెన్స్ క్యాపిటల్గా తీర్చిదిద్దుతాం. 'మేడ్ ఇన్ తెలంగాణ' ఉత్పత్తులు ప్రపంచ ఆకాశంలో సత్తా చాటుతున్నాయి. ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ప్రపంచ స్థాయిలో తన ముద్ర వేస్తోంది . అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్ క్యాబిన్ల నుంచి ఎఫ్-16

...మిగతాది 2 లో

## బంగారం వెదజల్లుతున్న అగ్నిపర్వతం

- కిలోల కొద్ది బయటపడుతున్న గోల్డ్



జయభేరి, న్యూఢిల్లీ :

ప్రపంచంలో ఎన్నో అగ్నిపర్వతాలు ఉన్నప్పటికీ, అంటార్కిటికాలోని ఎరెబస్ పర్వతం వాటన్నింటికీ భిన్నంగా నిలుస్తోంది. భూమిపై అత్యంత దక్షిణాన ఉన్న ఈ అగ్నిపర్వతం శాశ్వత లావా సరస్సుతో పాటు, ప్రతిరోజూ సూక్ష్మ బంగారు స్ఫటికాలను వాతావరణంలోకి విడుదల చేసే అరుదైన అగ్నిపర్వతంగా శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తోంది.

...మిగతాది 2 లో

# తిరుమలలో చేసినట్లు చేయండి

- యాదగిరిగుట్ట అభివృద్ధిపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

జయభేరి, హైదరాబాద్ :



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మఠాలు, కుల సంఘాలకు భూముల కేటాయింపుపై కొత్త పాలసీ రూపొందించాలని.. ఆ భూముల యాజమాన్య హక్కులు దేవస్థానానికే ఉండాలని స్పష్టం చేశారు. గెస్ట్ హౌస్‌ల నిర్మాణం, భూసేకరణ, టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. అంబులెన్స్‌లు, ఎంఆర్ఐ సేవలను ప్రారంభించిన సీఎం.. మహిళా స్వయం సహాయక సంఘాలకు విస్తృతంగా రుణాలు అందించాలని బ్యాంకులను కోరారు. తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దేశంలోనే అత్యుత్తమ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది.

ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ)లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి.. అవసరమైన చోట అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పరిధిలో వివిధ మఠాలు, ఆధ్యాత్మిక సంస్థలు, కుల సంఘాలకు భూములు కేటాయించే విషయంలో పారదర్శకమైన విధానం రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

ఆలయ భూములను వినియోగానికి ఇతరులకు ఇవ్వవచ్చని పేర్కొన్న ముఖ్యమంత్రి.. అయితే వాటిపై శాశ్వత యాజమాన్య హక్కులు మాత్రం దేవస్థానానికే ఉండాలని తేల్చి చెప్పారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు మార్కెట్ ధర ఆధారంగా జరగాలని ఆదేశించారు. యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు మెరుగైన వసతి కల్పించేందుకు గుట్టపై గెస్ట్ హౌస్‌ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సీఎం సూచించారు. ఇందుకు ముందుకు వచ్చే దాతల వివరాలను సేకరించి.. దశలవారీగా అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో కూడా తిరుమలలో అమలవుతున్న విధానాన్నే ఆదర్శంగా తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు.

అదే సమయంలో ఆలయ విస్తరణ, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని.. ఇందుకు తక్షణమే నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఆలయ నిర్మాణానికి సంబంధించి ఇంజినీర్ల కమిటీ సమర్పించిన నివేదికను సమగ్రంగా పరిశీలించి, వారంలోగా తుది నివేదిక అందించాలని సూచించారు. యాదగిరిగుట్టను కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగా కాకుండా అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. దీంతో దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఈ సమావేశంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా సీఎం ప్రారంభించారు. రెండు అంబులెన్స్‌లను ప్రారంభించడంతో పాటు, భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. మహిళల ఆర్థిక సాధికారతపై కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు.

స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను క్రమశిక్షణతో తిరిగి చెల్లిస్తున్నారని ప్రశంసించిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో లాజిస్టిక్ పార్కులు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన రుణాలను బ్యాంకులు పెద్ద ఎత్తున మంజూరు చేయాలని సూచించారు.



## కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 30 :

నిరు పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతూ బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని గుండ్లపల్లి సీపీఐ కర్యాలయంలో పేరబోయిన పెంటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షలాదిమంది నిరుపేదలు ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వేల మందికి ఇంటి స్థలాలు గానీ, ఇందిరమ్మ ఇల్లు గానీ ఇవ్వలేని పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉందన్నారు. ప్రతి పేదవాడికి ఉండడానికి ఇల్లు, ఇంటి స్థలం సాధన కోసం బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు నిరుపేదలంతా అధిక సంఖ్యలో వచ్చి మన హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో గ్రామాలలో నిజమైన పేదలకు న్యాయం జరగడంలేదని, ఆర్థికంగా ఉన్న వాళ్లకే ప్రయోజనం జరుగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గోదా శ్రీరాములు,జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ,బండి జంగమ్మ, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, నేతలు పెరబోయిన బంగారి, మీసాల దాసు, బోదాసు స్వామి, జగన్, కాటం శ్రీకాంత్, నమిల సంజీవ, ముక్కెర్ల పెంటయ్య, కంబాల వెంకటేష్, కిష్టమ్మ, యాదమ్మపాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మండలం అమలాబాకుల లో మంగళవారం రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రులతో కలిసి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా అమడబాకులలోని రైతు వేదికలో స్థానిక నాయకులు, రైతులతో కలిసి అట్టి వీడియో కాన్ఫరెన్స్ లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి తనవంతుగా అందించే పెట్టుబడి సహాయమే రైతు భరోసా

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

ధాన్యం పండించే రైతుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనవంతుగా అందించే పెట్టుబడి సహాయమే రైతు భరోసా అని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. ఎకరానికి రూ. 12, 000ల ఆర్థిక సహాయం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాగ్దానం అని ఆయన అన్నారు. రైతుల సంపదగా రూ. 9000 కోట్లు విడుదల చేయడం మొదలైంద న్నారు. మరోసారి రైతు భరోసా రైతుల ఖాతాల్లోకి 9,000 కోట్ల నగదు జమ వెల్లువల ఊపందు కొందన్నారు. రెండున్నర ఏళ్లలో రూ. 36 వేల కోట్లు అన్నదాతలకు రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూపాయలు 12 వేల రూపాయలు పెట్టుబడి సహాయం అందించడం జరిగిందన్నారు. 73.32 లక్షల మంది రైతుల ఫోన్లో టింగ్ టింగ్ అనే నోటిఫికేషన్ ధ్వని వినాలని సిద్ధమవుతున్నారని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.

## 2న దేవరకద్రలో నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందరావు వెల్లడి




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో ఈ నెల 2న నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె. ఆనందరావులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మహబూబ్ నగర్ జిల్లా కోర్టు పరిపాలన అధికారి ఎన్. వి. శ్రవణ్ కుమార్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవి దేవి హాజరవుతారని వారు తెలిపారు. అలాగే వారితో పాటు జిల్లా జడ్జిలు, జిల్లాకు చెందిన గౌరవ పలువురు ముఖ్య నాయకులు ఉమ్మడి జిల్లాలోని ఇతర బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, పలువురు సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొననున్నారని వారు తెలిపారు.




## పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి

- పాత పద్ధతి లో ఫీజ్ రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలి
- సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి 100,500 కోట్ల స్కాలర్షిప్ ,ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఆర్డీవో కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. ఆర్డీవో పి పద్మప్రియ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ ను స్కాలర్షిప్ 10,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని దీనివల్ల పేద విద్యార్థుల అయినటువంటి బీసీ ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు విద్యను దూరమైనటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం విద్యార్థుల పట్ల వివక్షత, మొండివైఖరి ప్రదర్శిస్తుంది. జీవో నెంబర్ 8, 9 తక్షణమే రద్దు చేసి పాత విధానంలో ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేసి పేద విద్యార్థులకు చదువుకునే విధంగా ప్రోత్సహిస్తూ చేయూత నివ్వాలని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేసి పేద విద్యార్థులకు కావలసినటువంటి పెండింగ్ బకాయిలు ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు ,భీమగోనీ శివ గౌడ్, మునగాల గణేష్, దోమకొండ హరి, జాతీయ అవార్డు గ్రహీత లౌడియా బాషా నాయక్ ,వసుకుల కృష్ణ యాదవ్, బొమ్మ శ్రీనివాస్ యాదవ్, జెల్లా వెంకట గౌడ్, గణేష్, విద్యార్థులు, కళాశాల యజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

## యాదయ్య విగ్రహాని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం గొడుకొండ్ల (మాల్) గ్రామానికి చెందిన మందారం యాదయ్య విగ్రహాని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... యాదయ్య మృతి పార్టీకి తీరని లోటు అని ఆయన అన్నారు. యాదయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, మల్లోజు జగన్, పులిరాజు గౌడ్,రామకృష్ణ, నిరంజన్ గౌడ్, జిట్ట జగదీష్, గ్యార పోచయ్య,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక ఫిరంగులు మాయం..!

- చారిత్రక ఫిరంగుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి
- షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు
- షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మూలకు పడేసిన ఫిరంగి
- రూ. 2లక్షలతో మున్సిపల్ ఎదుట నిర్మాణం చేసి పెయింటింగ్ వేసేందుకు నిధులు మంజూరు
- నిధులు ఏమయ్యాయి
- ఫిరంగి మూలకు ఎందుకు పడింది..?
- ఫిరంగుల మాయంపై పోలీసులకు ఫిర్యాదు..



జయభేరి, షాద్‌నగర్ :

షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రహరీ గోడ సమీపంలో ఉన్న చారిత్రక ఫిరంగుల నిర్లక్ష్య స్థితిపై రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. తాజాగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన బక్కని నర్సింహులు, ఫిరంగి పూర్తిగా దుమ్ము, ధూళితో కప్పబడి ఉండటాన్ని గమనించి స్వయంగా కొంత భాగాన్ని శుభ్రం చేశారు. గతంలో అక్కడ రెండు ఫిరంగులు ఉండేవని, ప్రస్తుతం ఒకటి మాత్రమే కనిపిస్తోందని, మరొకటి కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ చారిత్రక ఆయుధాలు గతంలో రాజుల నివాసంగా ఉన్న ప్రాంతంలో ఉండేవని, ప్రస్తుతం ఆ ప్రాంతం రైతు కాలనిగా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు.

చారిత్రక వారసత్వానికి గుర్తుగా ఉన్న ఈ ఫిరంగులను సంరక్షించి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు కోరారు. ఈ మేరకు ఫిరంగిల మాయంపై షాద్‌నగర్ సహాయ పోలీసు కమిషనర్‌కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఏర్పాటు

- చైర్మన్ గా ఎంఎస్ఎన్ అధినేత మన్నె సత్యనారాయణ రెడ్డి
- సభ్యులుగా ఎమ్మెల్యే వినోద్ వెంకట్ స్వామి, చిరంజీవి సతీమణి సురేఖ, రాఘవేంద్ర రావు, స్వాతి కంఠమణి సహ పదిమంది, ఎక్స్అఫీషియో సభ్యులుగా ఏడుగురు నియామకం
- రెండేళ్ల కాలపరిమితితో బోర్డు ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు





జయభేరి, యాదగిరిగుట్ట :

తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెవెన్యూ ఎండోమెంట్స్ 1శాఖ జీఓ జారీ చేసింది. ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం. సత్యనారా యణ రెడ్డిని నియమించగా, సభ్యులుగా ఎమ్మెల్యే వినోద్ వెంకట్ స్వామి, కొనిదెల సురేఖ, చిలప్ప గారి విజయరాజం, తూళ్ల విజయేందర్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కాంతామణి, రాఘవేందర్ రావు, డా. లక్ష్మీ నారాయణ నాయక్ తో పాటు ఫౌండర్ ట్రస్టీను నియమించింది. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ ప్రధాన కార్యదర్శి,ఎండోమెంట్స్ కమిషనర్,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, వైటిడిఏ వైస్ చైర్మన్, ఆలయ ఈవో, స్థానాచార్యులు లేదా సీనియర్ ప్రధాన అర్చకులను ఎక్స్అఫీషియో సభ్యులుగా నియమించింది. ఫౌండర్ ట్రస్టీ, ఎక్స్ అఫీషియో సభ్యులు మినహా మిగిలిన సభ్యుల పదవీ కాలం రెండేళ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అమల్లో ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్తగా నియమితులైన చైర్మన్,సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించేందుకు యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భవానీ శంకర్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.





# నియోజకవర్గ కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశం

జయభేరి, కొండమల్లేపల్లి :



కొండమల్లేపల్లి తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా దేవరకొండ నియోజక వర్గ కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశం సాయి కృప ఫంక్షన్ హాల్లో కొండమల్లేపల్లిలో దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ తోటపల్లి కిరణ్ అధ్యక్ష తన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ని యోజకవర్గంలోని ఎనిమిది మండలాలు, గ్రామాల నుంచి కుమ్మర వృత్తిదారులు, సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో హాజరై సంఘం బలోపేతం, వృత్తిదా రుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతం గా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏరుకొండ వెంకటేశం మాట్లాడుతూ, కుమ్మర వృత్తి నేటి పరిస్థితుల్లో ఎన్నో సవాళ్లను ఎదు ర్కొంటోందని, ప్రభుత్వ పరంగా ప్రత్యేక గుర్తింపు, ఉపాధి అవకాశాలు, బ్యాంకు రుణాలు, మట్టి కుంటల పరిరక్షణ, ఆధునిక యంత్ర పరికరాల సబ్సిడీ, శిక్షణా కార్యక్రమాలు, మార్కెటింగ్ సౌక ర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.
గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కుమ్మర వృత్తికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, వృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ మాట్లాడుతూ సభ్యులందరూ ఐక్యంగా ఉండి వృత్తి పరిరక్షణ, హక్కుల సాధన కోసం సమిష్టిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కుమ్మర సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి గ్రామంలో సంఘాన్ని విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించారు. సభలో సంఘం బలోపేతానికి పలు కీలక తీర్మానాలు ఆమోదించడంతో పాటు, రాబోయే రోజుల్లో కుమ్మర వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు. సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి సభ్యుడికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు నాగపూరి నాగేష్, ఎగిరిశెట్టి వీరయ్య, నిమ్మలూరి శ్రీనివాస్ , రంగారెడ్డి జిల్లా నాయకులు ఆడాల గణేష్, ఎగిరిశెట్టి బాలరాజు , లడ్డు నల్గొండ జిల్లా కన్వీనర్ రధరపు బిక్షపతి కో కన్వీనర్ గంగాధర్ వెంకటేశ్వర్లు , జిల్లా నాయకులు కామిశెట్టి శ్రీనివాస్ ,నిదానం పెల్లి వెంకటస్వామి, కంచర్ల రాము చిట్టి మల్ల ఆంజనేయులు, బత్తుల కృష్ణయ్య , ఆమంచి వెంకన్న, జిల్లా మహిళా కన్వీనర్ ఎగిరిశెట్టి అనిత,సాగర్ నియోజకవర్గం కన్వీనర్ ఏ లిజాల వెంకన్న, మునుగోడు నియోజకవర్గం కన్వీనర్, సిలువేరు సత్తయ్య, నల్గొండ నియోజకవర్గం కన్వీనర్, నిమ్మన గోటి శాంప్రసాద్, జిల్లా నాయకులు, దేవరకొండ నియోజకవర్గ ప్రతినిధులు మరియు కొండమల్లేపల్లి మండల కన్వీనర్ ఏరుకొండ రాము గుడిపల్లి కన్వీనర్ గణపురం వెంకటేశ్వర్లు, దిండి బొద్దుపల్లి లక్ష్మయ్య, గ్రామ కమిటీ సభ్యులు, యువజన నాయకులు, మహిళా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కుమ్మర వృత్తిదారులు పాల్గొన్నారు.



## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన గ్రామ సర్పంచ్

జయభేరి, గుడిపల్లి :

గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థినివి ద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి. ఈ సందర్భంగా వారికి ప్రతి బుధవారం సర్పంచ్ తన సొంత నిధులతో చికెన్ తో భోజనం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. వారు చాలా సంతోషంగా విద్యార్థిని విద్యార్థులు మరియు పాఠశాల యాజమాన్యం సర్పంచ్ ని అభినందించడం జరిగింది.

## ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జాకట ప్రేమ్ దాస్




జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని సైబరాబాద్ కార్పొరేషన్‌లోని అత్వెల్లి ప్రాంతంలో 16వ బూత్‌కు చెందిన బీఎల్ఓ అధికారి ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు జాకట ప్రేమ్ దాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సమయాన్ని వెచ్చించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ పత్రాలను తీసుకుని సక్రమంగా నింపి సంబంధిత బీఎల్ఓ అధికారికి అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బూత్ అధ్యక్షుడు సురేష్ కుమార్, కాలనీ అధ్యక్షుడు మల్లా రెడ్డి, శ్రీరాములు, కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలి

- మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్



జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కిష్టాపూర్ డివిజన్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం డివిజన్ పరిధిలో బూత్ స్థాయి అధికారులతో (బీఎల్ఓలు) కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా తుడుం గణేష్ మాట్లాడుతూ, ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టిందన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, అవసరమైన గుర్తింపు పత్రాలను బీఎల్ఓలకు అందజేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు తమ ఓటరు హక్కును పరిరక్షించుకోవాలంటే ఎన్యుమరేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని, పేరు, చిరునామా, కుటుంబ వివరాలు వంటి అంశాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని సూచించారు. అపోహలు, వదంతులను నమ్మకుండా బీఎల్ఓలు అందించే సూచనలను పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కిష్టాపూర్ డివిజన్‌లోని ప్రతి కుటుంబానికి ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఓలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## గుండ్ల పోచంపల్లి డివిజన్‌లో వేగంగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

- పూర్తి వివరాలతో ఫారాలు సమర్పించాలి: గరిసెల సురేందర్



జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ సర్కిల్ పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి గరిసెల సురేందర్ ముదిరాజ్ తెలిపారు. డివిజన్‌లోని కండ్లకొయ్య ప్రాంతంలో బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఆయన ఓటర్లకు ఎన్నికల కమిషన్ ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఓటరు తమ పూర్తి వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఫారాల్లో నమోదు చేసి సంబంధిత బీఎల్ఓలకు అందించాలని సూచించారు. ఓటరు జాబితా సక్రమంగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సహకరించాలని ఆయన కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సందేహాలు లేదా వివరాల కోసం సంబంధిత బీఎల్ఏలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కండ్లకొయ్య బీఎల్ఏ భానుపురం అరవింద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీరస్వామి పాల్గొన్నారు.

# భూనిర్వాసితులకు రూ. 300 కోట్ల పరిహారం విడుదలకు సానుకూలత

- ఆలేరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని సిఎం రేవంత్ రెడ్డి హామీ
- వాసాలమర్రి సామూహిక గృహప్రవేశాలకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆహ్వానం

జయభేరి, హైదరాబాద్, జూన్ 30 :



ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని,ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసిన బీర్ల అయిలయ్య ఆలేరు నియోజకవర్గంలోని పలు కీలక సమస్యలు, అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఆలేరు నియోజకవర్గంలోని ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని ఆలేరు ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా గంధమల్ల, బస్వపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు,వైటీడీఏ పరిధిలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు. బస్వపూర్ నిర్వాసితులకు రూ.100 కోట్లు,గంధమల్ల భూసేకరణకు రూ.100 కోట్లు, వైటీడీఏ పరిధిలోని భూసేకరణ కోసం మరో రూ.100 కోట్లు కలిపి మొత్తం రూ.300 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా, రాష్ట్ర ముఖ్యమంత్రి అందుకు అంగీకరించినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామంలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో కూల్చివేసిన ఇళ్ల అంశాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్ళినట్లు ఆలేరు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఆ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కింద 120 ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే కొంతమంది గృహప్రవేశాలు చేసుకున్నారని వివరించారు. త్వరలో గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్న సమూహ గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకావాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.ఆలేరు నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యా,వైద్య రంగాల అభివృద్ధి కి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నట్లు బీర్ల అయిలయ్య తెలిపారు.



## జాడ లేని జాబ్ క్యాలెండర్...?

- నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి....
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం
- ఖాళీగా ఉన్న పోలీసు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి...!
- లేదంటే మరో తెలంగాణ ఉద్యమం తప్పదు..!
- నిరుద్యోగులకు అండగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ...!
- తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ "సీమల రమేష్ కురుమ"...

జయభేరి, షాద్ నగర్, జూన్ 30 :

నిరుద్యోగుల ఆశీర్వాదంతో ఘనవిజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ సీమల రమేష్ కురుమ అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకుంటామని అబద్ధాల హామీలు చెప్పి ప్రస్తుతం నిరుద్యోగులను రోడ్డున వదిలేసిందని తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా సీమల రమేష్ కురుమ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.... నిరుద్యోగులు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అంత చులకన! నిరుద్యోగులు తలుచుకుంటే గత ప్రభుత్వం అతలాకుతలమైన విషయం కాంగ్రెస్ పార్టీకి తెలిసిన విషయమే కదా!!. త్వరలో త్వరలో నోటిఫికేషన్ అనే పేరుతో కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని, నిరుద్యోగులు హైదరాబాద్ పట్టణం దిల్ సుఖ్ నగర్, అదే విధంగా అనేక కోచింగ్ సెంటర్లలో అప్పులు చేసి మరి రాత్రింబవళ్లు చదువుకుంటున్నారని, ఇంకెప్పుడు నోటిఫికేషన్ అని ప్రతిరోజు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎన్ని ధర్నాలు చేసిన ప్రభుత్వ దృష్టికి నిరుద్యోగుల సమస్యలను తీసుకువెళ్లినా కూడా ఏ నాయకుడు స్పందించకుండా మౌనం పాటించడం కాంగ్రెస్ పార్టీ కుప్ప కూలిపోవడం ఖాయమని అన్నారు.

**డబ్బు లేక రాపిడో, స్విగ్గి, జొమాటోలో పనిచేస్తూ హాస్టల్ ఫీజులు కట్టుకుంటున్న నిరుద్యోగులు...**

రెండు సంవత్సరాల ఆరు నెలలు పూర్తయిన జాబ్ క్యాలెండర్, టీజీపీఎస్సీ, గ్రూప్ 1,2 ,3 4 ,వంటి ఏ ఒక్క నోటిఫికేషన్ సరైన విధంగా విడుదల చేయకుండా కాలయాపన చేయడంతో నిరుద్యోగులు తల్లిదండ్రులను డబ్బులు అడగలేక, పార్ట్ టైం జాబ్ గా ఫీజులు కట్టడానికి , రాపిడో, స్విగ్గి జొమాటోలో పనిచేస్తూ ఫీజులు కట్టుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మొండివైఖరికి త్వరలోనే నిరుద్యోగులు గుణపాఠం చెప్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

**నిరుద్యోగులకు అండగా తెలంగాణ రక్షణ సేన పార్టీ...**

నిరుద్యోగుల సమస్యలపై తమకు అండగా ఉంటామని తెలంగాణ రక్షణ సేన పార్టీ స్పష్టం చేసింది. నిరుద్యోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి ఖాళీగా ఉన్న అన్ని నోటిఫికేషన్లు విడుదల చేసేవరకు నిరుద్యోగులతో పోరాటం చేయడానికి తమ సిద్ధంగా ఉన్నామని, మరో తెలంగాణ ఉద్యమం ప్రారంభం కానున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# సఫాయి కార్మికుల కాంట్రాక్టు పద్ధతిని ఎత్తివేయాలి

- సోదా రామకృష్ణ, సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ యూనియన్ జాతీయ కార్యదర్శి.
- జాతీయ సఫాయి కర్మ చారిస్ వైస్ చైర్ పర్సన్ హర్దీప్ సింగ్ గిల్ ని కలిసి వినతి పత్రం అందజేసిన తెలంగాణ సఫాయి యూనియన్ బృందం.

జయభేరి, పరకాల, జూన్ 30:



మంగళవారం నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారీస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వైస్ చైర్ పర్సన్ హర్దీప్ సింగ్ గిల్ ని ఢిల్లీలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ సఫాయి, ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ బృందం. అనంతరం సఫాయి కార్మికుల వేతనాల విషయాల గురించి, విద్యార్థుల విద్య భవిష్యత్తు గురించి, తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో సఫాయి కార్మికులకు ఔట్ సోర్సింగ్ తీసివేసి డైరెక్ట్ నేరుగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, సఫాయి కార్మికుల వ్యవస్థలో కాంట్రాక్టు పద్ధతిని తీసివేసి వారికి ప్రభుత్వపరంగా వేతనాలు చెల్లించాలనే ముఖ్యమైన డిమాండ్లతో వినతి పత్రం అందజేసిన తెలంగాణ సఫాయి యూనియన్ ప్రతినిధి బృందం. ఈ బృందంలో ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జాతీయ కార్యదర్శి సోదా రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ పరచ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కారం వీర్ సింగ్, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు దేవేందర్ సింగ్ చిందాలియా లు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

- మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి

జయభేరి, మేడ్చల్ :



మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో జరుగుతున్న సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి సర్ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ బీఎల్ఓలు అందజేస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి తిరిగి సమర్పించాలని ఆయన కోరారు. సర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓటు హక్కును కోల్పోతే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఏ ఒక్క ఓటు కూడా గల్లంతు కాకుండా బీఆర్ఎస్ నాయకులు ఓటరు జాబితాను పరిశీలిస్తూ, ఎన్యుమరేషన్ పత్రాలు సమర్పించారా లేదా అనే విషయాన్ని వాకబు చేయాలని సూచించారు. అలాగే సర్ ప్రక్రియలో ఏ ఒక్క ఓటు కూడా తొలగించబడకుండా చూడాలని వీవోఏలు, వీఏజీవోలకు సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని జగన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు నర్సింహ గౌడ్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, సదానంద్, సింహాల్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించిన కార్మికులు

జయభేరి, హైదరాబాద్ :

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకొని మంత్రి ఇంటి మీదకు దూసుకెళ్లారు. గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసారుకనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి నివాసం వద్దకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేట్ బీమా సంస్థలకు అప్పగించొద్దు

- జీవో నెం.12 రద్దు చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లు విడుదల చేసి సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ కు వినతిపత్రం

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ మండలంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికులకు పథకాలు అందించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు డిప్యూటీ ఎంఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు. సిఎస్సి సంస్థ నిర్వహిస్తున్న హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని, సహజ మరణ నష్టపరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్ నిధులను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ మాట్లాడుతూ, తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత మరియు పాక్షిక అంగవైకల్య పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2025 జూలై 22న జీవో నెం.12 జారీ చేసిందని తెలిపారు. జీవో విడుదలైన వెంటనే ట్రెయిల్ బ్లైజర్ బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లను ప్రైవేట్ బీమా సంస్థలకు బదిలీ చేశారని ఆరోపించారు.

కార్మికులకు ఉపయోగం లేని సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో రూ.750 కోట్లకు పైగా ఖర్చు చేసి సంక్షేమ బోర్డు సెస్సు నిధులను దుబారా చేశారని ఆయన విమర్శించారు.

కేంద్ర చట్టాలు, రాష్ట్ర సంక్షేమ బోర్డు నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు, సిఎస్సి సంస్థలకు వందల కోట్లు కట్టబెట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి, వారి నిర్ణయాల మేరకే బోర్డు నిధులను ఖర్చు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ, కమిటీని నియమించకుండా ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు పథకాలను అప్పగించడం ద్వారా పేద నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుంచి 2025 వరకు 28 లక్షల 50 వేల మంది కార్మికులు బోర్డులో నమోదు చేసుకున్నప్పటికీ, కేవలం 15 లక్షల మందికే కార్డులను రెన్యువల్ చేశారని తెలిపారు. ఒక్కో కార్మికుడికి రూ.2,309 చొప్పున మొత్తం రూ.346.36 కోట్లను ప్రైవేట్ బీమా సంస్థలకు చెల్లించారని పేర్కొన్నారు. 2025 జూలై 24 నుంచి ఇప్పటివరకు కార్మికులకు కేవలం రూ.140 కోట్ల నష్టపరిహారం మాత్రమే చెల్లించగా, సుమారు రూ.200 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభంగా మిగిలాయని ఆరోపించారు. బోర్డు నుంచి డేటా అందలేదనే సాకుతో వేలాది మంది కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని, 13 లక్షలకు పైగా కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వివాహ కానుక, ప్రసూతి కానుక, ఆసుపత్రి ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చులు వంటి పథకాలు కూడా కార్మికులకు అందకుండా చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు పలు డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించారు. జీవో నెం.12ను వెంటనే రద్దు చేసి సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని, సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేసి కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందించాలని కోరారు. సహజ మరణ నష్టపరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.6,000 పెన్షన్, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు, గృహ వసతి, అడ్డాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని వెంటనే నియమించి సెస్సు నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. 13 లక్షలకు పైగా పెండింగ్‌లో ఉన్న లేబర్ కార్డులను యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలని, ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు అందించాలని, అర్హులైన కార్మికులకు నమోదు చేసిన 15 రోజుల్లోపు లేబర్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ ఎంఆర్ఓ మాట్లాడుతూ, నాయకులు ప్రస్తావించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీడబ్ల్యూయూ యూనియన్ నాయకులు ఎన్. కృష్ణ, సీహెచ్. కృష్ణ, జి. శ్రీను, అప్పన్న, స్వామి, రజిని, బిక్షపతి, సత్తయ్య, టీ. ధనలక్ష్మి, శ్రీనివాస్, పి. నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన తహసిల్దార్

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 30 :**

తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని తహసిల్దార్ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో సర్ ప్రక్రియ నిర్వహించబడుతుందని ,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై బీఎల్ఓ లతో కలిసి ఎన్యుమరేషన్ ఫారంలను ఓటర్లకు అందజేస్తున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రతి పౌరునికి ఓటరు జాబితాలో చేర్చి, అనర్హులను జాబితా నుండి లేకుండా ఉండేందుకు జూన్ 25 నుండి జూలై 24 వ తేదీ వరకు బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారంలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. తిరిగి వాటిని పూర్తిచేసి అందజేయాలని కోరారు. ఈ ప్రక్రియను బిఎల్వోలు పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రఘు రామారావు, జిపిఓ వెంకటేశం పాల్గొన్నారు.

## రెస్కో సిపిడబ్ల్యూ విలేజ్ వర్కర్ అప్పారావు ఘన ఉద్యోగ విరమణ



**జయభేరి, పరవాడ:**

రూరల్ ఎలక్ట్రికల్ కోఆపరేటివ్ సొసైటీ (రెస్కో )సిపిడబ్ల్యూ విలేజ్ వర్కర్‌గా సుదీర్ఘకాలం విశేష సేవలు అందించిన ఉరుకూటి అప్పారావు ఉద్యోగ విరమణ చేశారు.అగనంపూడి సెక్షన్ పరిధిలో ఆయన అందించిన ఉత్తమ సేవలను కొనియాడుతూ సమీపంలోని అమృత విలాస్ హోటల్‌లో అధికారులు,సహచర సిబ్బంది మరియు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు సత్కార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అప్పారావు తన విధి నిర్వహణలో ఎంతో అంకితభావాన్ని,నిబద్ధతను ప్రదర్శించారని కొనియాడారు. సంస్థ అభివృద్ధికి పాటుపడటమే కాకుండా,సిబ్బంది అందరితోనూ ఎంతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండేవారని గుర్తుచేశారు. అనంతరం అప్పారావు దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి,జ్ఞాపికను బహూకరించారు.ఆయన విశ్రాంతి జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. మురళీకృష్ణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ జె. ప్రసాదరావు,ఏడీఈ ప్రసన్నా రాణి,ఏఈ లక్ష్మణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు,సిపిడబ్ల్యూ యూనియన్ ప్రెసిడెంట్ సిద్ధ గోవిందరావు, అగనంపూడి సెక్షన్ సిబ్బంది మరియు అప్పారావు కుటుంబ సభ్యులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



## తెలంగాణ తల్లిని ఆహ్వానించడం అంటే కన్నతల్లిని అవమానించినట్టే..

- రాజా వరప్రసాద్‌పై వ్యాఖ్యలు సరికాదు!
- షాద్‌నగర్ టీజేఏసీ మాజీ చైర్మన్ టీ.జి. శ్రీనివాస్

**జయభేరి, షాద్ నగర్, జూన్ 30 :**

షాద్‌నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ధ్వంసం చేస్తానంటూ బహిరంగంగా వ్యాఖ్యానించిన రాజా వరప్రసాద్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలని తెలంగాణ పొలిటికల్ జేఏసీ టీజేఏసీ మాజీ చైర్మన్ టీ.జి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....తెలంగాణ తల్లి విగ్రహంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదించి గెజిట్ విడుదల చేసిందని, రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించడమే కాకుండా రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లో కూడా తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ తల్లి అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, రాష్ట్ర అస్తిత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రభుత్వం మరియు రాజకీయ పార్టీ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించకుండా చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు.

## పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు ఆత్మీయ వీడ్కోలు

**జయభేరి, రాజన్న సిరిసిల్ల :**

జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్‌బీలో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణయ్య, కొనరావు పేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ అలీ పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య ఇద్దరు అధికారులను పూలమాలలు వేసి,శాలువాలతో సన్మానించారు.పోలీస్ శాఖలో వారు సుదీర్ఘకాలం అంకితభావంతో, నిజాయితీగా విధులు నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడుతూ అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖలో వారి సేవలు చిరస్మరణీయమని, పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని, వ్యక్తిత్వానికి కాదని అదనపు ఎస్పీ తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా కుటుంబానికి లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు వచ్చినా జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సిఐ మొగిలి,ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుళ్లు వెంకటరమణయ్య , మహబూబ్ అలీతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 30 :**




తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో పౌర హక్కుల దినోత్సవాన్ని సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రవి కుమార్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అనగారిన వర్గాల వారికి భరోసా కల్పించడం, వారిని కూడా సమాజంలో సమాన హక్కులు సమాన అవకాశాలు కలిగిన పౌరులుగా గుర్తించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని అన్నారు. వారికి కుల వివక్షకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే వాటిపై అవగాహన కల్పించడం వారి హక్కులను తెలియజేయడం సంబంధిత ప్రభుత్వ శాఖలు తీసుకోవలసిన చర్యలు అందించాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన కార్యక్రమం కాదని పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొంటారని అన్నారు. సమ సమాజ స్థాపన కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి జూన్ 30వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. దీని ముఖ్య ఉద్దేశం కులవివక్ష నిర్మూలన సామాజిక సమానత్వం పెంపొందించడం, గ్రామాల్లో కులం ఆధారంగా వివక్ష చూపడం వేరువేరు గ్లాసులు ఉపయోగించడం, దేవాలయాల్లోకి అనుమతించకపోవడం,వివాహాలు ఇతర శుభకార్యాలకు పిలవకపోవడం,కులం పేరుతో అవమానించడం లేదా తక్కువ చూడడం వంటి సామాజిక దురాచారాలు ఎక్కడైనా ఉంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మన రాజ్యాంగం ప్రకారం అందరూ సమానులే కులం మతం వర్గం అనే తేడా లేకుండా ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడాలని సమానత్వము, సోదర భావము సరస్పర గౌరవం ఉన్న సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగాయపల్లి శివరాములు, పోలీస్ శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం దృష్టికి కౌలు రైతుల సమస్యలు

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 30 :**



ప్రభుత్వం దృష్టికి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు స్వరాజ వేదిక ప్రతినిధి కొండల్ రెడ్డి అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌలు రైతుల గుర్తింపు వారి సమస్యల పరిష్కారానికై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు సాగుదారులకు పంట సీజన్ మొదట్లోనే ఒక్కసారి గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గుర్తించిన సాగుదారులకు ఈ సంవత్సరంలో పథకాలు పంట కొనుగోలు వగైరా నేరుగా వారి పేరు మీదనే లభించాలని కౌలు సాగుదారు గుర్తింపు చట్ట ప్రకారం నిర్దిష్టంగా జరపాలని ఓటిపి వ్యవస్థ మాత్రమే కాక 2021 సాగుదారు చట్టంలో సూచించినట్లు, కౌలు రైతుల నుండి దరఖాస్తులు తీసుకొని గ్రామస్థాయి విచారణలో నిర్ధారించుకొని గుర్తింపు ఇవ్వాలని వీలైతే వ్యవసాయ శాఖ దీనికి బాధ్యత తీసుకునే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు.

సాగుదారులను నమోదు వెంటనే మొదలుపెట్టి జూలై నెలలోనే పూర్తి చేయాలని, ఈ ఖరీఫ్ లో ఎరువులు పంట నష్టపరిహారం పంట బీమా పంట కొనుగోలు రైతు బీమా వంటి పథకాలు నేరుగా అందజేయాలని అన్నారు. దీనివలన భూ యజమానుల భూమి హక్కులను భంగం లేదని హామీ ఇస్తూ ప్రభుత్వం ప్రచారం చేయాలని అన్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రవికుమార్ కు వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి, మల్కాపురం, గొల్లగూడెం, దేవోజి తండాల నుండి 25 మంది కౌలు రైతులతో పాటు ఆర్ డి ఎస్ ఎస్ విలాస్, కౌలు రైతుల సాధన కమిటీ సభ్యులు స్వప్న, కృష్ణ, ఫాతిమా, రైతు నేస్తం అధ్యక్షుడు గూడ రాజిరెడ్డి, స్వర భారతి ఉపాధ్యక్షురాలు కళాసికం సుచరిత, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

## గురువుని మించిన దైవం లేదు

- తెలంగాణ రక్షణ సేన షాద్‌నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి ముదిరాజ్...
- ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ సింగ్ ను ఘనంగా శాలువాతో సన్మానించిన ఉమాదేవి ముదిరాజ్

**జయభేరి, షాద్ నగర్, జూన్ 30 :**

తల్లిదండ్రుల తర్వాత పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దేది కేవలం గురువులు మాత్రమే అని తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి ముదిరాజ్ అన్నారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ సింగ్ పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన షాద్‌నగర్ మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యారంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సురేష్ సింగ్‌ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అదే విధంగా 4వ వార్డు కౌన్సిలర్ చల్లా వాణి పాండురంగారెడ్డిని కూడా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు కోసం సురేష్ సింగ్ ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందించి పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని, సురేష్ సింగ్ చేసిన సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.

## యువత గంజాయి.. డ్రగ్స్ కు బానిస కావొద్దు

- యువకులే దేశానికి వెన్నెముక లాంటి వారు
- గంజాయి డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి - సీఐ సైదులు



**జయభేరి, జవహర్ నగర్ :**

జవహర్ నగర్ ప్రధాన బస్టాండు వద్దగల బాబు జగ్జీవన్ రామ్ అంబేద్కర్ విగ్రహాల వద్ద తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రాంతి కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం ఆన్లైన్ మోసాలు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్ నగర్ రక్షక బట నిలయం సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తాలు హాజరయ్యారు ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటివారు యువకులు అనే విషయాన్ని యువత దృష్టిలో పెట్టుకొని గంజాయి డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ మనిషి పై ఎంతో చెడు ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు. జవహర్ నగర్ లో ఎక్కడైనా గంజాయి అమ్మకం కనిపిస్తే వెంటనే మాకు 100,లేదా 1903, వెంటనే సమాచారం అందించి గంజాయి డ్రగ్స్ విక్రయాలను అరికట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు అలాగే ఆన్లైన్ మోసాలతో అనేకమంది ఇబ్బందుల పాలవుతున్నారని బయటకు చెప్పలేక బలవన్ మరణాలకు పాల్పడుతున్నారని ముందుగానే ఆన్లైన్ మోసాలు పసిగట్టి వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో క్రాంతి కళాబృందం వ్యవ స్థాపక అధ్యక్షులు వెంకటాచారి, ఎస్సై రామ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర్ అధ్యక్షులు శ్రీకాంత్, సీనియర్ జర్నలిస్టు మోహన్ బైరాగి, తెలంగాణ రక్షణ సేన నాయకులు జంగిలి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహులు, ఓయూ జెఏసి నాయకులు బద్రి, టియుజెసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ట్రై స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి మంజుల, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశం, ఝాన్సీ, సరస్వతి, విద్యానికేతన్ హెడ్మాస్టర్ అరుణ్ కుమార్, విజ్ఞాన భారతి కాలేజ్ ప్రిన్సిపల్ పరమేశ్వర్ రెడ్డి, క్రాంతి కళాబృందం సభ్యులు ఆంజనేయులు, అనూష, నటరాజ్, భాస్కర్, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం

జయభేరి, మేడిపల్లి :

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ నిర్మాణ పనులను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. కాలనీలో చాలా కాలంగా ఉన్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్‌వెల్ నిర్మాణానికి నిధులు కేటాయించిన మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఎంపీ సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సహకారం



తో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి మాట్లాడుతూ, భగత్ సింగ్ కాలనీ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు ఈ బోర్‌వెల్ నిర్మాణం శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుందని, ప్రజల అవసరాలపై స్పందించి నిధులు కేటాయించిన ఎంపీ ఈటెల రాజేందర్‌కు, పనులు ప్రారంభించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డికి కాలనీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, సీపీఐ భగత్ సింగ్ కాలనీ కన్వీనర్ మహేశ్వరి, సీపీఐ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సిపిఐ నాయకులు బొందయ్య, చంద్రయ్య, నరేష్, మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు నరసింహ చారి, యాదగిరి, రామకృష్ణ, పవన్, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.



## అందరూ క్షేత్రస్థాయిలో తిరగండి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (SIR) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు), కార్యకర్తలు తమ తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఎక్కడా అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తొలగిపోకుండా, కొత్తగా అర్హత పొందిన వారందరి పేర్లు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని అన్నారు. SIR ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు కోరారు.

## నూతన అసోసియేషన్ సభ్యులను సన్మానించిన మాజీ కార్పొరేటర్

- మేడిపల్లి శ్రీ సాయి నగర్ కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులను సన్మానించిన పి యం సి 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి



జయభేరి, మేడిపల్లి :

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9 వ డివిజన్ మేడిపల్లి శ్రీ సాయి నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రభాకర్ చారి, ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి, కోశాధికారిగా నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇబ్రహీం, ఉపాధ్యక్షులు సరస్వతి, భాస్కర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరంజీవి, భాను ప్రకాష్, ప్రదీప్ మహిళ అధ్యక్షురాలు లక్ష్మి, సలహాదారులు కళావతి, రాజేశ్వరి లలితా, భారతి గౌరవ అధ్యక్షులు గా సుదర్శన్ రెడ్డి, సునీల్, హరిందర్ యాదవ్, యాదగిరి, కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అసోసియేషన్ సభ్యులను సన్మానించిన 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సింగిరెడ్డి పద్మారెడ్డి

- రాజ్యాంగం మనకు ఇచ్చిన అమూల్యమైన హక్కు 'ఓటు'
- బోడుప్పల్లో చురుకుగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ



జయభేరి, మేడిపల్లి :

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ చురుకుగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా భీమ్ రెడ్డి నగర్ కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని ప్రజలకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పిస్తూ, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మా రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు వెంటనే ఓటును నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవడం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ రాకేష్, శివ శంకర్, వీరస్వామి, కుమార్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధి కోసం విరాళం



జయభేరి, మేడిపల్లి :

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ రాయంచ కాలనీలో ఉన్న శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు ఆకుల మధుకర్, కిరణ్ నాయక్ తదితరులు కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా నాయకులు ఆకుల మధుకర్ దేవాలయ అభివృద్ధి కోసం తనవంతు సహకారంగా రూ.25,000 నగదు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు ఆకుల మధుకర్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, కృష్ణ, వెంకటేష్, సత్తయ్య, చందు, శ్రీనివాస్, సుమన్, అశోక్‌తో పాటు కాలనీవాసులు, భక్తులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల భూమిపూజ

- చర్లపల్లి చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :




చర్లపల్లి చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి పనుల భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. తెలంగాణ కారాగార & సంస్కరణ సేవల శాఖ, HYDRAA, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (IOCL) సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కారాగార శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, చర్లపల్లి చెరువు పునరుద్ధరణ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలు సమన్వయంతో చేపడుతున్న ఈ కార్యక్రమం నగర అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కారాగార శాఖ, HYDRAA, IOCL అధికారులు, స్థానిక నాయకులు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

జయభేరి, కాప్రా :




టీజీఎస్‌పీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్ మర్రపు శ్రీనివాసరావు పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సైనిక్‌పురి సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన టీజీఎస్‌పీడీసీఎల్ (TGSPDCL) లైన్ ఇన్‌స్పెక్టర్ మర్రపు శ్రీనివాసరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావుని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. విద్యుత్ శాఖలో ఎన్నో సంవత్సరాల పాటు నిబద్ధతతో, నిజాయితీతో ప్రజలకు సేవలందించి విజయవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం అభినందనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్ జీవితంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు చేకూరాలని ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొని మర్రపు శ్రీనివాసరావుకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేబినెట్ లో మరో మంత్రి

జయభేరి, హైదరాబాద్, జూన్ 30 :



తెలంగాణపై భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో మరొకరికి అవకాశం లభిస్తుందా, లేక ప్రస్తుతం ఉన్న ఇద్దరితోనే సరిపెడతారా అనే అంశంపై రాష్ట్ర బీజేపీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ మార్పులు, చేర్పుల ప్రచారం నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ ఎంపీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో తమకు అనుకూలంగా సమీకరణాలను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఊహించని విధంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది కమలం పార్టీ. దీనికి అదనంగా లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కిషన్ రెడ్డి కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత తెలంగాణలోనే పార్టీ అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని బీజేపీ జాతీయ నాయకత్వం బలంగా విశ్వసిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యంగా కేంద్ర మంత్రులు, జాతీయ నేతలు రాష్ట్రంలో నిరంతరం పర్యటిస్తున్నారు. ఈ తరుణంలో, రాష్ట్రంలోని ముఖ్య నాయకుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను సమూలంగా పరిష్కరించి, కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి మరో మంత్రి పదవిని కేటాయించడం దోహదపడుతుందని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ నుంచి ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ మంత్రి పదవులు ఉండగా, రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా మూడో వ్యక్తికి అవకాశం కల్పించడం ద్వారా సామాజిక సమతుల్యతను సాధించాలని అధిష్ఠానం యోచిస్తోంది. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకునేందుకు పలువురు సీనియర్ నాయకులు ఎవరి ధీమాతో వారు ఉన్నారు. ప్రధానంగా ఈటల రాజేందర్, డి.కె.అరుణ, ధర్మపురి అర్వింద్, జి.నగేశ్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.అయితే., ఈటల రాజేందర్, డీకే అరుణ రేసులో ముందు వరుసలో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే బీసీ సామాజిక వర్గం నుంచి బండి సంజయ్ మంత్రివర్గంలో ఉన్నప్పటికీ, బలమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఈటల రాజేందర్‌కు అవకాశం కల్పిస్తే రాష్ట్రంలో రాజకీయంగా పెద్ద ఎత్తున కలిసి వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సైతం ఈసారి గట్టి ఆశలతో ఉన్నారు. ఈ విస్తరణలో మహిళలకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉండటం, పైగా ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ గట్టి పోటీని తట్టుకుని ఆమె విజయం సాధించడంతో ఆమె పేరును అధిష్ఠానం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే, డీకే అరుణ ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక వర్గం నుంచే ఇప్పటికే కిషన్ రెడ్డి క్యాబినెట్ మంత్రిగా అత్యంత కీలక బాధ్యతల్లో ఉన్నారు. అలాగే శాసనసభలో పార్టీ పక్ష నేత కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, ఒకే సమీకరణం నుంచి మరో వ్యక్తిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఓసీ, బీసీ వర్గాలకు కేంద్రంలో చోటు దక్కినందున, గిరిజన ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్‌కు అవకాశం ఇవ్వవచ్చనే ప్రచారం కూడా ఊపందుకుంది. మరోవైపు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం తనదైన శైలిలో గట్టి నమ్మకంతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. మొత్తంమీద, తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రస్తుతమున్న మంత్రులలో ఎటువంటి మార్పులు చేయకుండానే, అదనంగా మరొకరికి అవకాశం కల్పించే వ్యూహాన్ని అధిష్ఠానం అమలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, బీజేపీ జాతీయ నాయకత్వం చివరి నిమిషంలో నిర్ణయాలు మార్చడంలో ప్రసిద్ధి చెందినందున, ఈ విస్తరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉత్కంఠ కొనసాగడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (MMC) చీఫ్ ఇంజనీర్ వి. అశోక్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా వనస్థలిపురంలోని జైత్రా బ్యాంక్వెట్స్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి. అశోక్ రెడ్డిని శాలువాతో సత్కరించి, ప్రభుత్వ సేవలో ఆయన అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడంలో, అభివృద్ధి పనుల అమలులో ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ లో గులాబీ రివర్స్ స్కెచ్

జయభేరి, హైదరాబాద్, జూన్ 30 :

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ పరిధిలో ఎలాగైనా సరే మళ్లీ పాగా వేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ గట్టిగా ట్రై చేస్తోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త వ్యూహాలతో దూసుకుపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్లపాటు పెద్దగా జనంలోకి రాని గులాబీ శ్రేణులు.. ఇప్పుడు మాత్రం రూట్ మార్చాయి. రోజువారీగా ప్రజల్లో ఉంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. గ్రేటర్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ, నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ కేడర్‌లో కొత్త జోష్ నింపుతున్నారు. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం జీహెచ్ఎంసీపై ఇంతలా ప్రత్యేక దృష్టి పెట్టడం వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలోనే ఏకంగా 24 అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. దీనికి ఆనుకుని ఉన్న శివారు నియోజకవర్గాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు 35 కి చేరుకుంటుంది. అంటే, రాష్ట్ర అధికార పీఠాన్ని శాసించడంలో దాదాపు మూడో వంతు బలం ఒక్క గ్రేటర్ పరిధిలోనే దాగి ఉందన్నమాట.అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా, హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మాత్రం బీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అదే ఊపును రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కొనసాగించి, ~~ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీని గనుక మట్టికరిపించగలిగితే~~.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నల్లేరుపై నడకే అని బీఆర్ఎస్ గట్టిగా భావిస్తోంది. ఇక్కడ సాధించే విజయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి గట్టి పునాది వేయవచ్చనేది కేటీఆర్ మాస్టర్ ప్లాన్‌గా కనిపిస్తోంది.గత కొన్ని రోజులుగా కేటీఆర్ హైదరాబాద్‌లోని దాదాపు అన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. కేవలం పార్టీ కార్యాలయాలకే పరిమితం కాకుండా, నేరుగా నియోజకవర్గాల వారీగా పర్యటిస్తూ స్థానిక లీడర్లతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ.. ఎన్నికల సమరానికి క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయి సమీక్షల్లో అటు స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూనే, ఇటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.ముఖ్యంగా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన SIRపై పార్టీ శ్రేణులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను జనంలోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్.. కేటీఆర్ దూకుడుతో ఇప్పుడు రూట్ మార్చింది. దాదాపు రెండేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు రోజూ జనంలో ఉండేందుకే స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రాధాన్యత ఇస్తున్నారు. గల్లీ గల్లీలో పర్యటిస్తూ, ప్రజా సమస్యలపై గళమెత్తుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కేవలం కేసీఆర్ హయాంలోనే సాధ్యమైందనే విషయాన్ని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నగరం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు.మొత్తానికి హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కలు చూపించేందుకు కేటీఆర్ సిద్ధమయ్యారు. ఒకవైపు 24 నియోజకవర్గాల అండ, మరోవైపు కేటీఆర్ దూకుడుతో గ్రేటర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇక్కడ పట్టు నిలుపుకోవడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ బీఆర్ఎస్ హవా సృష్టించాలనే 'రివర్స్ స్కెచ్' ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి. కేటీఆర్ వ్యూహాత్మక కొట్లాట అధికార కాంగ్రెస్ పార్టీకి గ్రేటర్ పరిధిలో ఖచ్చితంగా పెద్ద సవాల్‌గా మారబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



# రష్యన్ భామల బ్యూటీ సీక్రెట్స్!

**రష్యా పడతులు.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తారు. లేత గులాబీ వర్ణంలో.. అందానికి సరికొత్త నిర్వచనంగా మెరిసిపోతుంటారు. తాజాగా, వీరి బ్యూటీ సీక్రెట్స్‌ను వెల్లడించారు బ్యుటీషియన్లు. రష్యా మహిళల మేనిఛాయ రహస్యాన్ని బయటపెట్టారు.**

చర్మాన్ని శుభ్రపరచడానికి రష్యా మహిళలు 'బన్యా స్టీమ్‌బాత్'ను ఎక్కువగా ఆశ్రయిస్తారు. ఈ స్టీమ్‌బాత్ వల్ల చర్మ రంధ్రాలు లోతుగా శుభ్రమవుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఈ పురాతన చర్మ సంరక్షణ పద్ధతితో.. మానసికశారీరక విశ్రాంతితోపాటు చర్మానికి మెరుపు, ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. ప్లాస్టిక్, రసాయన ఉత్పత్తులకు పూర్తి దూరంగా ఉంటారు.

చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు బిర్చ్/ఓక్ కొమ్మలతో తయారైన స్క్రబ్‌లను ఉపయోగిస్తారు. వీటితో చర్మాన్ని సున్నితంగా మసాజ్ చేయడం వల్ల.. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

ఎప్పుడూ చల్లగా, పొడిగా ఉండే రష్యాలో.. చర్మం పొడిబారుతూ ఉంటుంది. అందుకే, చర్మాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి కొన్ని రకాల సముద్రపు ఉత్పత్తులు, పొద్దు తిరుగుడు, ఆముదం నూనెను వాడుతారు. వీటిలో చర్మ ఆరోగ్యాన్ని రక్షించే పోషకాలు, వృద్ధాప్య నిరోధక లక్షణాలు ఎక్కువ. అవి చర్మం, జుట్టుకు మంచి హైడ్రేషన్ అందిస్తాయి.

కోల్డ్ వాటర్ థెరపీ, ఐస్ ఫేషియల్స్‌తో చర్మాన్ని ఎప్పటికప్పుడు రిఫ్రెష్‌గా ఉంచుకుంటారు. ఈ థెరపీలతో ముఖచర్మం బిగుతుగా మారుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటంతోపాటు ముడతలూ తగ్గుముఖం పడుతాయి.

ఇక కళ్ల కింద వాపును నివారించడంలో కోల్డ్ వాటర్ థెరపీ అద్భుతంగా పనిచేస్తుంది.

రష్యన్ల సాంప్రదాయ మాస్క్‌లలో ఎక్కువగా ఉపయోగించే పదార్థాలు.. సోర్ క్రీం, తేనె. వంటింట్లో నిత్యం అందుబాటులో ఉండే ఈ పదార్థాలు.. చర్మాన్ని తేమగా, కాంతివంతంగా ఉంచుతాయి.

ఇక క్లెన్సర్లుగా పాల ఉత్పత్తులకు ఓటేస్తారు రష్యన్ అమ్మాయిలు. ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని మృదువుగా, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సాయపడుతుంది. చర్మం పీహెచ్ సమతుల్యతను కాపాడటంతోపాటు చర్మ సహజవర్ణాన్ని మెరుగుపరచడంలోనూ ముందుంటుంది.

..ఇలా రసాయన ఉత్పత్తులపై ఎక్కువగా ఆధారపడకుండానే రష్యన్ అమ్మాయిలు అందాన్ని కాపాడుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ.. 'బ్యూటీ'కి కేరాఫ్‌గా నిలుస్తున్నారు.



# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు.. మంచిగా పడుకోవాలంటే...

**ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది.**

కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం.

ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి. ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్ర లేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.

ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు. ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది.

దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచినిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.

**ఎవరెవరికి ఎంతెంత?**

ఏడాదిలోపు పసిపిల్లలకు.. రోజుకు 12 నుంచి 16 గంటల నిద్ర అవసరం ఉంటుంది.

ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులు 11 నుంచి 14 గంటలు నిద్రపోవాలి.

మూడు నుంచి ఐదేళ్లలోపు వారికి .. రోజుకు 10 నుంచి 13 గంటలు నిద్రపోతే ఆరోగ్యం. పాఠశాలకు వెళ్లే ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లలు రోజుకు 9 నుంచి 12 గంటలు నిద్రపోవాలి. యుక్త వయసులోకి వచ్చిన వారు ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల వరకు నిద్రించాలి.

**మంచి నిద్ర రావాలంటే..**

పిల్లలు మంచి నిద్రపోయేలా వారి వయసుకు తగ్గట్లుగా కొన్ని అలవాట్లు చేయాలి. పడుకునే ముందు పిల్లలు రిలాక్స్ కావాలి. 'బెడ్ రొటీన్స్'ను అలవాటు చేయాలి. చిన్నారుల రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి.


అలాగే, రాత్రిపూట డిన్నర్ లైట్‌గా ఉండేలా చూసుకోవాలి. రాత్రిపూట నిద్రపోవడానికి మారాం చేసే పిల్లలకు పెరుగన్నం, అరటిపండును తినిపిస్తే.. త్వరగా పడుకునే అవకాశం ఉంటుంది.

పడుకునే ముందు పిల్లలకు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తే.. త్వరగా నిద్రపోతారు.

ఇంట్లో అందరూ ఒకే సమయానికి నిద్రపోతే.. వారితోపాటు పిల్లలూ నిద్రలోకి జారుకుంటారు.

సాయంత్రంపూట పిల్లలు ఔట్‌డోర్స్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడాలి.

దీనివల్ల వారి శరీరం అలిసిపోయి.. త్వరగా నిద్రపోవడానికి ఆస్కారం ఉంటుంది.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

(*NOTE:* ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)



# అందుకే అలా డబ్బులు సంపాదించా...




ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్స్ అవకాశాల కోసం ఈగర్ గా ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పుడు ఓ హీరోయిన్ సినిమా భారీ హిట్ అయినా తనకు రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించింది. ఆ సినిమా వల్ల అందరూ లాభపడ్డారు కానీ తనకు మాత్రం రూపాయి కూడా ఇవ్వలేదు అని తెలిపింది. ఆమె మరెవరో కాదు నోరా ఫతేహి. బాలీవుడ్ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసింది నోరా ఫతేహి. నోరా ఫతేహికి దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. స్పెషల్ సాంగ్స్ కు పెట్టింది పేరు ఈ అమ్మడు. నోరా ఫతేహి ఎక్కడ ఉన్నా ఆ వైబ్ నెక్స్ట్ లెవల్ లో ఉంటుంది. ఈ బ్యూటీకి ఫాలోయింగ్ కూడా భారీగా ఉంటుంది. నెట్టింట చాలా యాక్టివ్ గా ఉంటుంది ఈ చిన్నది. నోరా ఫతేహి మాట్లాడుతూ.. నేను చేసిన స్పెషల్ సాంగ్స్ వల్ల నాకు మంచి గుర్తింపు వచ్చింది. అలాగే సాంగ్స్ కూడా భారీ హిట్ అయ్యాయి. సినిమాలు కూడా మంచి విజయాలను అందుకున్నాయి. కానీ నిర్మాతలు నాకు మాత్రం రూపాయి కూడా ఇవ్వలేదు. ఇలా ఎన్నో సినిమాలు నాకు ఉపయోగపడేలేదు. కానీ నేను స్టేజ్ పర్ఫామెన్స్ ఇవ్వడం వల్లే నాకు డబ్బులు వచ్చాయి. స్టేజ్ పర్ఫామెన్స్ వల్లే నేను డబ్బులు సంపాదించా.. డబ్బు లేకుండా కేవలం పేరు మాత్రమే సొంతం చేసుకుంటే ఏం లాభం. ఇక పై ఎలాంటి లాభం లేకుండా పని చేయకూడదు అని నిర్ణయించుకున్నా చెప్పుకొచ్చింది. .



## భార్యతో కలిసి కొత్త కారు కొన్న డాక్టర్ బాబు..

కార్తీక దీపం సీరియల్ తో బాగా పాపులర్ అయిపోయాడు నిరుపమ్ పరిటాల. అంతకు ముందు కూడా పలు సినిమాలు, సీరియల్స్ లో నటించినా ఈ సీరియల్ తోనే బాగా క్రేజ్ తెచ్చుకున్నాడీ బుల్లితెర నటుడు. ఈ సీరియల్ లో నిరుపమ్ పోషించిన కార్తీక్ అలియాస్ డాక్టర్ బాబు పాత్ర బాగా ఫేమస్ అయిపోయింది. ఇక నిరుపమ్ భార్య మంజుల కూడా బుల్లితెరపై బాగా ఫేమస్. వీరిద్దరూ చంద్రముఖి సీరియల్ లో కలిసి నటించారు. ఇద్దరి మనసులు కలవడంతో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెద్దల అంగీకారంతో పెళ్లిపీటలెక్కారు. ప్రస్తుతం ఈ సెలబ్రిటీ దంపతులకు అక్షజ్ ఓంకార్ అనే కుమారుడు ఉన్నాడు. ఇదిలా ఉంటే డాక్టర్ బాబు తాజాగా ఒక కొత్త కారు కొన్నాడు. తన భార్య మంజులతో కలిసి షోరూమ్ కు వెళ్లిన అతను ప్రముఖ ఎంజీ బ్రాండ్‌కు చెందిన ఈవీ లగ్జరీ కారును కొనుగోలు చేశాడు. ఈ శుభవార్తను మంజులనే సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. 'నా కొత్త కారు' అంటూ అంటూ తన భర్తతో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది బుల్లితెర నటి. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఈ దంపతులకు అభినందనలు చెబుతున్నారు. కాగా మార్కెట్లో ఈ ఈవీ కారు విలువ దాదాపు రూ.20 లక్షల వరకు ఉంటుందని తెలుస్తోంది. కాగా ప్రముఖ నటుడు ఓంకార్ కుమారుడే నిరుపమ్ పరిటాల. 2006లో చంద్రముఖి సీరియల్ ద్వారా తెలుగు టీవీ రంగంలోకి అడుగు పెట్టాడు. ఆ తర్వాత మూగమనసులు, అత్తారింటికి దారేది, మావి చిగురు, కన్యాదానం, కలవారి కోడళ్లు, కలియుగ రామాయణం,గృహ ప్రవేశం, కుంకుమ పువ్వు, రాధకు నీవే రా ప్రాణం, కార్తీక దీపం తదితర సీరియల్స్ లో నటించి బుల్లితెర స్టార్ గా గుర్తింపు తెచ్చుకున్నారు.

## వానరసేనతో యుద్ధఘట్టం



'వారణాసి' చిత్రాన్ని అనుకున్న టైమ్‌లో పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నారు దర్శకుడు రాజమౌళి. కొంతటాకీ పార్ట్ మినహా దాదాపు షూటింగ్ పూర్తికావొస్తున్నదని ఆయన ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 7 నుంచి మొదలుకానుంది. ఇందులో అత్యంత కీలకమైన యుద్ధ సన్నివేశాల్ని తెరకెక్కించబోతున్నారట. చిత్ర కథానాయకుడు మహేశ్‌బాబుతో పాటు ప్రధాన తారాగణం ఈ షూట్‌లో పాల్గొంటారని, దాదాపు 3000 మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొనే ఈ పోరాట ఘట్టాలు సినిమాలోనే హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. వానరసేన నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ సీక్వెన్స్ రోమాంచితంగా ఉంటుందని, దాదాపు రెండుమూడు వారాల పాటు ఏకధాటిగా ఈ సినిమా షెడ్యూల్‌ను చేయబోతున్నారని సమాచారం. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని దాదాపు 1500కోట్ల భారీ వ్యయంతో తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.



## 'ఓజీ2'లో నాయికగా?

అగ్ర కథానాయిక పూజాహెగ్డే కొంతకాలం పాటు తెలుగు సినిమాకు దూరంగా ఉంది. బాలీవుడ్‌పై దృష్టి పెట్టిన ఈ సొగసరి అక్కడ వరుస ఫ్లాపులు పలకరించడంతో మళ్లీ దక్షిణాది బాట పట్టింది. ప్రస్తుతం తెలుగు, తమిళంలో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు తొలిసారి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌తో జోడీ కట్టబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... బ్లాక్‌బస్టర్ మూవీ 'ఓజీ'కి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దర్శకుడు సుజీత్ ప్రస్తుతం సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు కథానాయిక అన్వేషణలో కూడా చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. ఈ రేసులో పూజాహెగ్డే పేరు ప్రముఖంగా వినిపిస్తున్నదని, ఆమెనే ఖరారు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం పూజాహెగ్డే తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

# ముదిరిన వివాదం..

## హీరో అఖిల్ రాజ్ కారుపై దాడికి యత్నం.. రంగంలోకి పోలీసులు..



రాజు వెడ్స్ రాంబాయి ఫేం అఖిల్ చుట్టూ ఇప్పుడు వివాదం ముదురుతోంది. హీరో వర్సెస్ డెలివరీ బాయ్స్‌గా ఈ ఇష్యూ మారింది. ఇరు వర్గాలూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ మెట్లెక్కాయి. ఒకరిపై ఒకరు కొట్టుకునే దాకా వెళ్లారు. అసలు ఏం జరిగింది? ఒక ఐటమ్‌ను రాంగ్ డెలివరీ చేసినందుకు ఇంత పెద్ద గొడవ జరిగిందా? డెలివరీ బాయ్స్ అంతా కలిసి హీరో కారును ఎందుకు వెంటాడారు? అసలు తప్పు ఎవరిది?.. అనే వివరాలను తెలుసుకుందాం.. గచ్చిబౌలి ఏరియా మొత్తం ఒక్కసారిగా షేక్ అయిపోయింది! హీరో అఖిల్ రాజ్ తమ తోటి డెలివరీ బాయ్‌ను అవమానించాడనే వార్త దావానలంలా వ్యాపించడంతో డెలివరీ బాయ్స్ ఒక్కటయ్యారు. అఖిల్ ఉంటున్న అరుణ రెసిడెన్సీ వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో కాసేపు రెక్కీ చేశారు. హీరో ఎప్పుడు బయటకు వస్తాడా అని కాపు కాశారు. సరిగ్గా అఖిల్ తన కారులో ఇంటి నుంచి బయటకు రాగానే.. డెలివరీ బాయ్స్ గుంపు ఒక్కసారిగా కారును చుట్టుముట్టి దాడికి ప్రయత్నించింది. ప్రాణభయంతో అఖిల్ తన కారులోనే ఉండి.. ఆ విజువల్స్‌ను, తనను వెంబడిస్తున్న వారిని మొబైల్‌లో వీడియో రికార్డ్ చేశాడు. తాము పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నా వినకుండా వారు రెచ్చిపోవడంతో.. అఖిల్ నేరుగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, తన ప్రాణాలకు ముప్పు ఉందంటూ ఫిర్యాదు చేశాడు. అంతకుముందే, ఉదయమే సదరు డెలివరీ బాయ్ కూడా అఖిల్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరు వర్గాల కేసులను సీరియస్‌గా తీసుకున్నారు. ఈ ఫిర్యాదుల కంటే ముందే సోషల్ మీడియా వేదికగా ఇరు పక్షాల మధ్య తీవ్రమైన ఆరోపణల యుద్ధం నడిచింది. మొదట బాధితుడిగా చెప్పుకున్న డెలివరీ బాయ్ రమేశ్ ఇన్‌స్టాగ్రామ్‌లో కన్నీరు పెట్టుకుంటూ ఒక వీడియో రిలీజ్ చేశాడు. తాను చేసిన చిన్న పొరపాటుకు క్షమాపణలు చెప్పినా వినకుండా, హీరో అఖిల్ తనను దారుణంగా దూషించాడని, కొట్టడానికి వచ్చాడని ఆరోపించాడు. అంతటితో ఆగకుండా తనపై ఉమ్మివేసి తీవ్రంగా అవమానించారని కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు హీరోపై తీవ్రంగా మండిపడ్డారు. దీంతో రంగంలోకి దిగిన హీరో అఖిల్ రాజ్.. నెగెటివ్ కామెంట్స్ చేసే ముందు తన వైపు న్యాయాన్ని కూడా చూడాలని కోరాడు.

అసలు కారణం ఏంటంటే..

అసలు ఈ రచ్చ అంతటికీ కారణం.. అరుణ రెసిడెన్సీలో జరిగిన ఒక రాంగ్ డెలివరీ. అఖిల్ నివసిస్తున్న అరుణ రెసిడెన్సీ ఫ్లాట్ నెంబర్ 201కి ఎదురుగా 'చేలం రెసిడెన్సీ' అనే మరో అపార్ట్‌మెంట్ ఉంది. అందులోని ఫ్లాట్ నెంబర్ 201కి రావాల్సిన ఒక పార్సిల్‌ను డెలివరీ బాయ్ రమేశ్.. పొరపాటున అఖిల్ ఇంటి అడ్రస్‌లో ఇచ్చేసాడు. పార్సిల్‌పై అడ్రస్ స్పష్టంగా ఉన్నా.. ఓటీపీ గానీ, పేరు గానీ సరిచూసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడనేది అఖిల్ వర్షన్. ఇంట్లో నలుగురు ఉండటంతో ఎవరో ఆర్డర్ చేశారనుకుని అఖిల్ తండ్రి ఆ పార్సిల్ తీసుకున్నారు. ఆ విషయం తెలియని అఖిల్ తల్లి.. వచ్చిన ప్యాకెట్‌ను ఓపెన్ చేసేశారు. తీరా ఇంట్లో ఎవరూ ఆర్డర్ చేయలేదని తెలిసి దాన్ని పక్కన పెట్టారు. సరిగ్గా 20 నిమిషాల తర్వాత తప్పు తెలుసుకున్న డెలివరీ బాయ్ వెనక్కి వచ్చి పార్సిల్ అడిగాడు. అడ్రస్ చూసుకోవా బ్రదర్ అని అఖిల్ ప్రశ్నిస్తే.. 'నేను చూసుకోలేదు, ఇచ్చేశానంతే' అంటూ రమేశ్ దురుసుగా సమాధానం ఇచ్చాడనేది అఖిల్ చెబుతున్న వాదన. ఇంతలో అఖిల్ తల్లి వచ్చి.. తెలియక ఓపెన్ చేశాం బాబూ అంటూ పార్సిల్ తిరిగి ఇస్తుంటే.. 'ఫ్రీగా వస్తే ఓపెన్ చేసి తీసుకుంటారా' అంటూ రమేశ్ వెటకారంగా మాట్లాడాడట. ఇది కూడా అఖిల్ చెబుతున్న వర్షనే. దాంతో తల్లిని అన్న మాటలకు ఆగ్రహించిన అఖిల్.. సరిగా మాట్లాడు అంటూ హెచ్చరించాడు. ఆ డెలివరీ బాయ్ 'నువ్వు హీరోవి కదా.. చూడు ఏం చేస్తానో' అంటూ ఫోన్ తీసి వీడియో రికార్డ్ చేయడం ప్రారంభించాడట. ఆ చిన్న వాగ్వాదమే చివరకు ఇంత పెద్ద వివాదానికి, దాడులకు దారితీసింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**